

నేడు ఫెర్రీరేవు వేలంపాట

నరసాపురం: సఖినేటిపల్లి-మాధవాయిపాలెం ఫెర్రీ రేవు వేలంపాటకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు. గురువారంతో డిపాజిట్ గడువు ముగిసిందన్నారు. మొత్తం 15 మంది షెడ్యూల్ కొనుగోలు చేశారు. అయితే డిపాజిట్ రూ.31.30 లక్షలను ఎనిమిది మంది మాత్రమే డీడీల రూపంలో ఇచ్చారు. వీరు మాత్రమే శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగే పాటలో పాల్గొననున్నారు. నిబంధనల ప్రకారం ముందుగా బహిరంగ వేలం పాట నిర్వహిస్తారు. ఆ తర్వాత సీల్ టెండర్లను తెరుస్తారు. ఈరెండింటిల్లో ఎవరు హెచ్చు మొత్తంలో పాడుకుంటే వారికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రేవు నిర్వహణ బాధ్యతలను అప్పగించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పాట ప్రారంభంకానుంది. గతంలో ఎన్నడూ ఇంత మంది పాటదారులు షెడ్యూళ్లు కొనుగోలు చేసిన దాఖలు లేవు. దీంతో ఈసారి పాట రికార్డు స్థాయిలో వెళ్లవచ్చని అధికారులు అంచనా వేసున్నారు.

కౌలు కార్డున్నా.. రుణం ఇవ్వరు..!

కూటమి ప్రభుత్వంలోనూ కౌలురైతులకు అన్యాయం

కౌలు కార్డులిచ్చినా పంట రుణాలు మంజూరు నిల్

ఏలూరు జిల్లాలో 65 వేలకు కౌలు కార్డుల జారీ.. 23 వేల మందికే రుణం

'పశ్చిమ'లో 87వేలు కౌలు కార్డులు అందజేత.. 24 వేల మందికే పంట రుణం

జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం కౌలు రైతుల చేతుల్లోనే



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వంలోనూ కౌలు రైతులకు న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. కౌలు కార్డులిచ్చిన రైతులకు సైతం బ్యాంకులు పంట రుణాలు ఇవ్వని పరిస్థితి కొనసాగుతోంది. రబీ సాగు ముగుస్తున్నా కౌలు రైతులకు అరకొర రుణాలతో మమ అనిపించిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి కౌలు రైతులు వ్యవసాయం చేయాల్సిన దుస్థితి. జిల్లా వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలు రైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 80శాతం కౌలు రైతులే వ్యవసాయ సాగు చేస్తున్నారు. బ్యాంకులిచ్చే పంటరుణాలు మాత్రం సాగుచేస్తున్న కౌలు రైతులకు ఇవ్వని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కౌలు కార్డులు అందించిన రైతులకు సైతం పంట రుణాలు మంజూరు చేయకపోవడం అత్యంత దారుణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో 65 వేల మంది కౌలు రైతులకు, పశ్చిమగోదావరి జిల్లాలో 87 వేల మంది కౌలు రైతులకు కౌలు కార్డులు జారీ చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 23,314 మంది కౌలు రైతులకు రూ.142.85 కోట్లు మాత్రమే పంట రుణాలు మంజూరు చేసినట్లు బ్యాంకర్ల మీటింగ్‌లో వెల్లడించారు. అధికారిక లెక్కల ప్రకారం చూసినా కౌలు కార్డులు అందుకున్న 41,686 మంది కౌలు రైతులకు ఒక్క పైసా పంట రుణం అందని పరిస్థితి నెలకొంది. కౌలు కార్డులు ఎందుకిచ్చినట్లో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో 24 వేల మంది కౌలు రైతులకు రూ.235 కోట్లు పంట రుణాలు మాత్రమే ఇచ్చారు. కౌలు కార్డులు ఇచ్చిన 63 వేల మంది కౌలు రైతులకు పంట రుణం మంజూరు చేయని దుస్థితి నెలకొంది. జిల్లా వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఇప్పటివరకూ కౌలురైతులకు బ్యాంకులు జారీచేసిన పంటరుణాల లెక్కలు చెబుతున్నాయి. ఏలూరు జిల్లాలో ఈ ఏడాది డిసెంబర్ నాటికి వ్యవసాయ రంగంలో స్వల్పకాలిక రుణాల కింద రూ.6,639 కోట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంట్లో కౌలు రైతులకు ఇచ్చిన రుణం ఇప్పటివరకూ రూ.142.85 కోట్లు మాత్రమే. అంటే ఒక్కశాతం సొమ్ము కూడా కౌలు రైతులకు రుణాలుగా అందించని పరిస్థితి నెలకొంది. పశ్చిమలోనూ అదే పరిస్థితి కొనసాగుతోంది. కౌలు కార్డులు జారీ చేసిన రైతులకు సైతం పంటరుణాలు ఇవ్వకపోవడం అత్యంత దారుణమని చెప్పొచ్చు. బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకపోవడంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి కౌలు రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. వ్యవసాయ సాగు చేయని భూ యజమానులు మాత్రం పంట రుణాలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వంలోనూ ఇదేపరిస్థితి కొనసాగ్గా, తాము అధికారంలోకి వస్తే కౌలురైతులకు న్యాయం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వంలోనూ అదేరీతి నడుస్తోంది.

కొత్త కౌలుచట్టం ఊసే మరిచారు..

తాము అధికారంలోకి వస్తే కౌలు చట్టంలో మార్పులు చేసి కౌలు రైతులకు న్యాయం చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పింది. అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున హడావుడీ చేసి పలు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ పేరుతో సమావేశాలు సైతం నిర్వహించింది. అర్థాంతరంగా సమావేశాలు ఆపేసింది. తర్వాత కౌలుచట్టం గురించి పట్టించుకోవడం లేదు. బడ్జెట్ సమావేశాలు సైతం పూర్తయ్యాయి. కొత్త కౌలు చట్టం మాత్రం తీసుకురాలేదు. కొత్త కౌలు చట్టం వస్తే కౌలు రైతులకు ప్రభుత్వం అందించే బీమా, పంట నష్టపరిహారం, పంట రుణాలు వంటివి అందే అవకాశం ఉంటుందని రైతులంతా గంపెడాశతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం కౌలు రైతులను తీవ్రంగా వంచించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కలల సాకారంలో భాగంగా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల రీసైక్లింగ్ పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక వేత్తలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థిక ప్రగతి సాధ్యమన్నారు. వివిధ పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులను అన్ని శాఖలూ నిర్ణీత గడువులోగా అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పర్చేందుకు అన్ని అనుబంధ శాఖలూ సమన్వయంతో మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి వర్గాలు ఔత్సాహిక నూతన పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. జిల్లా స్థాయి నుండి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై అవగాహన పెంపొందించాలన్నారు. పిఎంఇజిపి పథకం కోసం అర్హులైన లబ్ధిదారుల ఎంపిక మండలాల వారీగా నివేదికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలని తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు మాట్లాడుతూ పిఎంఇజిపి పథకంలో 307 మంది లబ్ధిదారులకు బ్యాంకులు రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్‌విఎస్‌వి.ప్రసాద్, ఎపిఎఫ్ సిసిఐ మేనేజింగ్ కమిటీ సభ్యులు కె.సత్యనారాయణరాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎఎస్ఎన్ ప్రసాద్, జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎపిపిసిబి అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రమేష్, ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ప్లానింగ్ ఆఫీసర్ వి.సుధాకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

జెసి రాహుల్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

రబీ సీజన్లో రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలని జిల్లా జాయింట్ టి.కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై ధాన్యం సేకరణ కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాల ద్వారా ధాన్యం కొనుగోళ్లపై గ్రామస్థాయిలో రైతులందరికీ పూర్తి అవగాహన కల్పించామని, అలాగే కనీస మద్దతు ధర వివరాలు కూడా తెలియజేశామని తెలిపారు. సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2,300, గ్రేడ్-ఏ రకం రూ.2,320 మద్దతు ధర కల్పించినట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర కన్నా తక్కువ ధరకు అమ్ముకోకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరాం ప్రసాద్, డిఎస్‌ఒ ఎన్.సరోజ, జిల్లా సహకార శాఖ అధికారి ఎం.నాగరాజు, జిల్లా రవాణా శాఖ అధికారి బి.ఉమామహేశ్వరరావు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ వివి.నాగ రాజారావు, మార్కెటింగ్ ఎడి కె.సునీల్ కుమార్, ఎఎస్‌ఒ ఎం.రవిశంకర్, వ్యవసాయ శాఖ అధికారి ప్రియదర్శిని పాల్గొన్నారు.

ప్రతిసారీ బైపాస్ అలైన్‌మెంట్ మార్పు సరికాదు

ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోం - సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వాలు మారినప్పుడల్లా బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు చేయడం సరికాదని, మీ పార్టీల శ్రేయస్సు కోసం ప్రజల భవిష్యత్తును గాలికొదిలేస్తారా అంటూ సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో జిల్లాలో నిర్మించే బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై విలేకరులతో మాట్లాడారు. ఆకివీడు నుంచి దిగమర్రును కలిపే బైపాస్ గత 7, 8 ఏళ్ల క్రితం ఉండి, భీమవరం టౌన్, నర్సయ్య అగ్రహారం, విస్సాకోడేరు, పెన్నాడ, నందమూరు మీదుగా వెళ్తున్నట్లు ప్రకటించారన్నారు. దానికి సంబంధించి కొంత పనికూడా జరిగిందన్నారు. ఎప్పుడైతే బైపాస్ రోడ్డు వస్తుందని ప్రభుత్వం ప్రకటించిందో అనేకమంది మధ్యతరగతి, ఇతర ప్రజలు స్థలాలు కొనుగోలు చేసుకోవడం, ఇతర పెట్టుబడులు పెట్టారని తెలిపారు. ప్రోసెస్ నడిచిన తర్వాత ఆకస్మికంగా అలైన్‌మెంట్ మార్పు చేస్తూ కొత్త గెజిట్‌ను విడుదల చేశారన్నారు. ఆకివీడు, పెదపుల్లేరు, చినపుల్లేరు, చినమిరం, రాయలం, గునుపూడి మీదుగా మళ్లించారన్నారు. ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ అధికారులు, హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు రోడ్డు వేయాలని నిర్ణయానికి వచ్చి, స్థలసేకరణ చేసి, మార్కింగ్ ఇచ్చి కొన్నేళ్లయిన తర్వాత దాన్ని మళ్లీ అలైన్ మార్చడం వెనుక కారణాలు ఏంటని ప్రశ్నించారు. ఈ పనుల వల్ల ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇష్టానుసారం అలైన్‌మెంట్లు మార్పుచేస్తారన్నారు. ఈ చర్యల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ విధానం మంచిది కాదన్నారు. దీన్ని ఎందుకు మార్పు చేస్తున్నారో ప్రజానీకానికి చెప్పాల్సిన అవసరం ఉందని, వివరణ ఇవ్వాలని కోరారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

నేటి నుంచి మెగా హ్యాండీ క్రాఫ్ట్స్ ఎక్స్ పో

వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళా ఉత్పత్తులు ప్రదర్శన



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డిఎస్‌పి శ్రీవేద

నరసాపురం : రుస్తుంబాద గ్రామంలోని ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్(ఐఎల్‌టిసి)లో మెగా హ్యాండీ క్రాఫ్ట్ ఎక్స్ పోను ఏర్పాటు చేసినట్లు లేస్ ట్రేడ్ సెంటర్ సమన్వయకర్త కల్వకొలను నాగ తులసీరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 21 నుంచి 25 వరకు అయిదు రోజుల పాటు జరిగే ఎక్స్ పోలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన హస్త కళాకారులు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 80 మంది చేతివృత్తిదారులచే 80 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. రోజు వెయ్యికిపైగా సందర్శకులు తిలకించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. చేతివృత్తిదారులచే తయారుకాబడిన ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి వీలుగా స్టాల్‌లు ఏర్పాటు చేసినట్లు తులసీరావు తెలిపారు. దేశంలో ప్రసిద్ధ గాంచిన హస్త కళలు ఫ్యాషన్ జ్యువలరీ, గృహోపకరణాలు, హోం పర్నిసింగ్, లేసు ఉత్పత్తులు, కలంకారీ శారీస్, ఫ్యాషన్ హాండ్ బాగ్స్, రెడీ మేడ్ వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు తదితర హాండి క్రాఫ్ట్ వస్తువుల ప్రదర్శనలు ఉంటాయన్నారు. ప్రత్యేక ఆకర్షణగా ఫుడ్ కోర్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లలు ఆడుకోవడానికి ఉచితంగా ప్లే జోన్ ఏర్పాటు చేశామన్నారు. నరసాపురం లేసు ఉత్పత్తులు, ఢిల్లీ జ్యువలరీ, జమ్మూకాశ్మీర్ టక్ పెయింటింగ్, ఉత్తరప్రదేశ్ మెటర్ క్రాఫ్ట్స్, గుజరాత్ స్టోన్ క్రాఫ్ట్స్, హర్యాన ఉడ్ కార్వింగ్, కర్ణాటక ఉడెన్ టాయ్స్, రాజస్థాన్ లక్క బ్యాంగిల్స్, వెస్ట్ బెంగాల్ మీనాక్షి జ్యువలరీ పాల్గొని ట్రేడ్ సెంటర్లో ఏర్పాటు చేసిన స్టాల్స్ వారి ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయిస్తారన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన డిఎస్‌పి శ్రీవేద

ఇంటర్నేషనల్ లేసు ట్రేడ్ సెంటర్‌లో జరగనున్న హ్యాండీ క్రాఫ్ట్ ఎక్స్ పో ఏర్పాట్లను గురువారం నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద పరిశీలించారు. కార్యక్రమం వివరాలను, ముఖ్య అతిథుల వివరాలు, పార్కింగ్ స్థలాన్ని, సీసీ ఫుటేజ్‌లు, ఇతర వివరాలను డిఎస్‌పి నిర్వాహకులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. డిఎస్‌పి వెంట నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్, రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేష్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

డిఐఇఒ నాగేశ్వరరావుకు ఎస్ఎఫ్ఐ వినతి



డిఐఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ బృందం డిమాండ్ చేసింది. జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం తరగతులు ఇప్పటికే ప్రారంభించిన శ్రీచైతన్య, నారాయణ, ఆదిత్య, తిరుమల వంటి జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించింది. ఎస్ఎఫ్ఐ బృందం డిఐఇఒ కె.నాగేశ్వరావును స్థానిక కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించి సమస్యను వివరించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడారు. విద్యా సంస్థలు ప్రారంభించి తరగతులు నిర్వహిస్తున్నారని, అలాగే ముందుస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. సంబంధిత విద్యా సంస్థలపై శాఖా పరమైన చర్యలూ తీసుకోవడంతోపాటు సంబంధిత విద్య సంస్థల గుర్తింపు రద్దు చెయ్యాలి డిమాండు చేశారు. వారిపైన చర్యలూ తీసుకోకపోతే ఇంటర్ బోర్డు కమిషనర్ కోన శశిధర్ ఫిర్యాదు చేస్తారని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.లక్ష్మణ్, బి.గణేష్, జిల్లా కమిటీ నాయకులు బి.సింధు, కె.గోవింద్, ఎం.భాగ్యలక్ష్మి, కె.రోహిత్, సతీష్, ప్రసాద్ ఉన్నారు.

నరసాపురానికి సైక్లోథాన్ బృందం



మొగల్తూరు : సైకిల్ యాత్ర చేపడుతున్న సిఐఎస్ఎఫ్ సిబ్బంది

ప్రజాశక్తి - నరసాపురం

సిఐఎస్ఎఫ్ 56వ స్థాపన దినోత్సవం సందర్భంగా సురక్షిత తీరం, సమృద్ధి భారతదేశం అనే థీమ్‌తో ఈనెల 7వ తేదీన చేపట్టిన దేశవ్యాప్త సైక్లోథాన్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని బక్కలి నుంచి తమిళనాడులోని కన్యాకుమారి వరకూ 86 మంది సభ్యులతో చేపడుతున్న సైకిల్ యాత్ర గురువారం నరసాపురం పట్టణానికి చేరుకుంది. కోనసీమ అంబేద్కర్ జిల్లా సఖినేటి పల్లి నుంచి వశిష్ఠ గోదావరి పంటిపై ప్రయాణించి నరసాపురం చేరుకున్నారు. మాధవాయి పాలెం రేవు వద్ద వీరికి జనసేన నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త పోలిశెట్టి శ్రీనివాస్, రోటరీ క్లబ్ సభ్యులు, సీనియర్ సిటీజన్స్ అసోషియేషన్ సభ్యులు, పట్టణ సిఐ బి.యాదగిరిలు ఘన స్వాగతం పలికారు. అనంతరం సైకిలింగ్ చేస్తు ఒఎన్‌జిసి టెంపుల్ ల్యాండ్‌కు చేరుకున్నారు. టెంపుల్ ల్యాండ్‌లో ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ క్యాడేట్స్, సిఐఎస్ఎఫ్ యూనిట్ సిబ్బంది హారతులతో స్వాగతం పలికారు. అనంతరం నరసాపురం ఒన్‌జిసి యూనిట్ కమాండర్ ఎస్‌కె.సత్పతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ కమాడెంట్ వీకే ప్రభాకరన్ మాట్లాడారు. తీర ప్రాంత ప్రజలకు జాతీయ భద్రత పట్ల అవగాహన కల్పించడం, ఉగ్రవాదం, మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు వంటి ముప్పులపై వారికి సూచనలు ఇస్తూ సుమారు 6 వేల కిలోమీటర్లు చేయడం ఈ సైక్లోథాన్ ప్రధాన లక్ష్యమన్నారు. దేశం మొత్తంలో 25 రాష్ట్రాలలో 358 పైగా యూనిట్లలో అను నిత్యం కోట్ల మంది ప్రజల సురక్షిత ప్రయాణాలకు, లక్షల కోట్ల ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తుల పరిరక్షణకు, శాంతి భద్రతలలో ముఖ్య భూమిక పోషిస్తున్నట్లు చెప్పారు. ఒఎన్‌జిసి నరసాపురం యూనిట్ కమాండర్ ఎస్‌కె.సత్పత్తి మాట్లాడుతూ స్థానికులు, భద్రతా సంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, ముఖ్యంగా యువతకు మాదక ద్రవ్యాల ముప్పు, తీర భద్రత ప్రాముఖ్యత గురించి చైతన్యం కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, జనసేన నాయకుడు పోలిశెట్టి శ్రీనివాస్, ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సోదరుడు సునీల్ నాయకర్ మాట్లాడుతూ దేశ రక్షణలో కేంద్ర భద్రతాదళం కీలకపాత్ర వహిస్తుందన్నారు. దేశంలో అత్యున్నత ప్రమాణాలు గల భద్రతను అందిస్తున్న పారా మిలటరీ దళం సిఐఎస్ఎఫ్ మహోన్నత ఆశయంతో సైకిల్ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి, లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి, ఘంటా కృష్ణ పాల్గొన్నారు.

మొగల్తూరు : సిఐఎస్ఎఫ్ బృందానికి మండలంలోని కొత్తాట గ్రామంలో ఘన స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన శ్రీరామ సీ ఫుడ్స్ అధినేత సత్తినేని శ్రీనివాస తాతాజీ ఆ బృందానికి శీతల పానీయాలు, పళ్లు తదితర వాటిని అందించారు. ఈ సందర్భంగా సిఐఎస్ఎఫ్ అధికారులు మాట్లాడారు. డిఎస్‌పి కె.మానస, ఎస్ఐ జి.వాసు వారిని అభినందించి వీడ్కోలు పలికారు.

ప్రభుత్వ కాలనీల్లో సమస్యలు అధికారులకు పట్టవా!

కాలనీని ఆనుకుని ఉన్న ఆక్వా చెరువులను రద్దు చేయాలి

తక్షణం మౌలిక వసతులు కల్పించాలి

మోగల్లు ప్రభుత్వ కాలనీని పరిశీలించిన సిపిఎం బృందం



కాలనీ వాసులతో మాట్లాడుతున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి - పాలకోడేరు

మోగల్లు ప్రభుత్వ కాలనీలో సమస్యలు తక్షణం పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ కాలనీని సిపిఎం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ మండలంలో అతిపెద్ద లే అవుట్‌లో మోగల్లు ఒకటన్నారు. ఈ కాలనీలో 700కు పైగా ఫ్లాట్‌లు ఉండగా సుమారు 450పైగా నివసిస్తున్నారు. కనీస మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయి అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీ పక్కనే అనధికార ఆక్వా చెరువులు ఉన్నాయని, దానివల్ల కూడా కాలనీ మునిగిపోతుందని ప్రజలు తెలిపారన్నారు. తక్షణం నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆక్వా చెరువులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాటర్ ట్యాంక్ వేశారు కానీ ఇంకా ప్రారంభించకపోవడం వల్ల తాగునీరు సమస్య అధికంగా ఉందన్నారు. 15 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న ఎస్‌టి యానాదులకు కనీసం స్థలం ఇవ్వలేదని, వారి ఆధార్, రేషన్ కార్డులు అడ్రస్‌లు మార్పు కోరితే డబ్బులు అడగడం అన్యాయమన్నారు. వారి అడ్రస్‌లో మార్పులు చేసి వెంటనే వారికి పక్కా ఇళ్లను కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బృందంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.క్రాంతిబాబు, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, గ్రామ కార్యదర్శి పాలా వెంకటస్వామి, నాయకులు వీరవల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

ఆక్వా రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుని రక్షించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉండి మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం రైతు సంఘం మండల కమిటీ సమావేశం మండల ఉపాధ్యక్షులు జీను ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ పాల్గొని మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టడం కోసం రైతులు నష్టాల పాలవుతున్నా ప్రభుత్వాధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. కోల్డ్ స్టోరేజీలు లేని కారణంగా రొయ్యలను నిల్వ చేసుకునేందుకు అవకాశం లేక అయిన కాడికి అమ్ముకోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా పట్టుబడి సమయంలో దళారులు సిండికేట్ అయ్యి రైతులను దోచేస్తున్నారని విమర్శించారు. రొయ్యల పంట వల్ల ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నప్పటికీ రైతులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా స్టోరేజీ విషయంలో గాని, ధరలు, సీడు, మేత విషయంలో గాని ఏమీ పట్టించుకోకుండా ప్రభుత్వాధికారులు పట్టించుకోవట్లేదన్నారు. నాణ్యమైన సీడు అందించడంలోనూ, నాణ్యమైన మందులు అందించడంలోనూ, నాణ్యమైన మేత అందించడంలోనూ ప్రభుత్వాధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. మేత షాపులనుపైన, మందుల షాపుల పైన ఎటువంటి తనిఖీలు లేని కారణంగా వాళ్ల ఇష్టారాజ్యంగా కల్తీ మేత, కల్తీ మందులు విచ్చలవిడిగా చలామణి అవుతుందని ఆందోళన పడ్డారు. ఇటీవల కాలంలో చిన్న, సన్న కారు రైతులు పెట్టిన పెట్టుబడులు రాక అప్పులపాలై ఆత్మహత్యలు పెరగడమే కాకుండా భూములను అమ్ముకొని అప్పులు తీర్చిన విషయం అందరికీ తెలిసినదే. చిన్నసన్న కారు రైతులు బ్యాంకు రుణాలను మాఫీ చేసి వెంటనే రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కిలారి తవిటి నాయుడు, మాదాసు గోపి పాల్గొని మాట్లాడారు.

రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి : జెసి

ఉండి: రీ సర్వేలో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలో నిర్వహిస్తున్న రీసర్వేను పరిశీలించిన జెసి మాట్లాడుతూ రీ సర్వేలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా రైతు శ్రేయస్సు లక్ష్యంగా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. గ్రామంలోని ప్రజల నుంచి గాని, రైతుల నుంచి గాని ఎటువంటి ఫిర్యాదులు లేకుండా రీ సర్వే నిర్వహణలో జాగ్రత్తలు వహించాలని, రీసర్వే నిర్వహణలో అజాగ్రత్తలు వహించి నిర్లక్ష్యంగా ఉన్నట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల జరిగిన గ్రామసభలలో రీ సర్వేపైనే అధిక సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయని ఆయన గుర్తుచేశారు. రీ సర్వే సమయంలో సంబంధిత యజమాని పర్యవేక్షణలో నిర్వహించినట్లయితే ఎటువంటి ఫిర్యాదులకు తావు ఉండదని సూచించారు. మండల తహశీల్దార్ కావడి నాగార్జున, మండల సర్వేయర్ రత్నావళి, విఆర్ఒ గోవిందరాజులు పాల్గొన్నారు.

దూడలకు బ్రూసెల్లా వ్యాక్సిన్

గణపవరం : మండలంలో 4-8 నెల వయస్సు ఉన్న లేగ దూడలకు బ్రూసెల్లా వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేస్తున్నట్లు గణపవరం ప్రాంతీయ పశువైద్య శాఖ సహాయ సంచాలకులు డి.వి.నాయక్ గురువారం చెప్పారు. లేగ దూడలకు వ్యాధి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 25 గ్రామాల్లో వ్యాక్సిన్ వేస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన

నరసాపురం : పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పరిశీలించారు. పారిశుద్ధ్యం లోపించకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యంపైనే ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రోడ్లు శుభ్రంగా ఉంచాలని, మురుగు కాలువలు శుభ్రం చేసి చెత్తను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నామన్నారు. శివారు కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సానిటరి ఇన్‌స్పెక్టర్ వెంట్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కృత్రిమ పిచ్చుక గూళ్ల పంపిణీ

ఆకివీడు : మండలంలోని అయిభీమవరంలోని కెఐ.నరసింహారాజు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎస్.కృపానందం అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా కృత్రిమ పిచ్చుక గూళ్లను పంపిణీ చేశారు. ఒకప్పుడు ఇళ్ల ముందు సైతం కిచకిచలాడుతూ హడావిడి చేసే పిచ్చుకలు నేడు కనుమరుగవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పిచ్చుకలను సంరక్షించడానికి తన శక్తి మేరకు నాలుగు సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన చెప్పారు. ఇక్రమంలో భాగంగానే పిచ్చుకగూళ్లను పలువురికి పంపిణీ చేశానని ఆయన చెప్పారు.

కోమటితిప్పలో పశువైద్య శిబిరం

మొగల్తూరు : మండలంలోని కోమటితిప్ప గ్రామంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించామని వైద్యురాలు జె.నీలిమ తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణలో భాగంగా ఏర్పాటు చేసిన శిబిరంలో 78 మూగజీవాలకు వ్యాధి నివారణ టీకాలు వేసామని నీలిమ తెలిపారు.

విద్యార్థులకు ఉగాది కవితలు, పద్య పోటీలు

భీమవరం టౌన్ : మన సంస్కృతి సాంప్రదాయాలను చెరగని ముద్రలని, ఉగాది, సంక్రాంతి, దసరా లాంటి పండుగలు మన సంప్రదాయ పండుగలని అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం శ్రీవిజ్ఞానదేవి ఆధ్వర్యంలో సర్ సివి రామన్ స్కూల్లో విద్యార్థులకు ఉగాది కవిత పద్య పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు సాంప్రదాయ పండుగపై కవిత, పద్యాలు అందరినీ అలరిస్తున్నాయని అన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత, ఉపాధ్యాయులు వరలక్ష్మి, పార్థ మాట్లాడుతూ 36 ఏళ్లగా ఉగాది పండుగ విశిష్టతపై ఇటువంటి పోటీలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 63 మంది విద్యార్థులకు ఉగాది కవితలు, తెలుగు పద్యాలు, కథానికల పోటీలు నిర్వహించామని, 14 మంది గెలుపొందారని, వారికి ప్రశంసా పత్రాలను అందించామని అన్నారు.

ప్రజా సంతృప్తే లక్ష్యంగా రీసర్వే

నరసాపురం : భూ పరిపాలనలో పారదర్శకత, ప్రజా సంతృప్తే లక్ష్యంగా రీ సర్వే పనులు నిష్పక్షపాతంగా నిర్వహించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు అన్నారు. గురువారం నరసాపురం మండలం మల్లవరం గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని సందర్శించి భూ రీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని రీ సర్వేతోనే సాధ్యమవుతుందని ఆర్‌డిఒ అన్నారు. ఎలాంటి లోపాలకు తావు లేకుండా భూముల రీ సర్వే చేపట్టాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సర్వే డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వి.కె.కుమార్, డిప్యూటీ తహశీల్దార్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. నరసాపురం రుస్తుంబాదలోని ఇంటిగ్రేటెడ్ లేఔట్ బ్రిడ్జ్ సెంటర్లో ఐఎసిహెచ్ ఆధ్వర్యంలో జరుగుతున్న హ్యాండీ క్రాఫ్ట్స్ ఎక్స్ పో ఏర్పాట్లను ఆర్‌డిఒ దాసి రాజు గురువారం సందర్శించారు. హ్యాండీ క్రాఫ్ట్స్ ప్రదర్శన స్టాల్స్, వేదిక, రోడ్డు మార్గం తదితర వాటిని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, హ్యాండీ క్రాఫ్ట్స్ నిర్వాహకులు కలవకొలను తులసీరావు, తాతాజీ, రాజేష్ ఉన్నారు.

ఆక్రమణల తొలగింపుపై భిన్నాభిప్రాయాలు

వీరవాసరం : నవుడూరు సెంటర్‌లో ఆక్రమణలు తొలగింపు పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం కూడా ఆక్రమణలు తొలగింపు జరిగింది. ఆర్అండ్‌బి రహదారిని ఆక్రమించుకుని శాశ్వత కట్టడాలు కట్టి, వాటి ద్వారా ఆక్రమణదారులు భారీగా అద్దెలు వసూలు చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆక్రమణదారులకు సుమారు రూ.కోటి వరకు అద్దె రూపంలో ముట్టి ఉంటుందని చెప్పుకుంటున్నారు. ఇక్కడ ఆక్రమణలు తొలగించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. ఆక్రమణల పర్వం మరోసారి పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. సుమారు ఇరవై సంవత్సరాలు నుంచి ఆక్రమణల తొలగింపుపై ఇరు పక్షాల మధ్య వాదనలు జరుగుతున్నాయి. కొంత మంది ఉద్దేశపూర్వకంగానే ఆక్రమణలు తొలగింపుకు వెనక నుంచి పనిచేశారంటూ కొంత మంది టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణలు తొలగింపులో అధికారులకు భారీగా ముడుపులందాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆక్రమణలు తొలగింపు తాత్కాలికంగా నిలిపి వేయాలని భీమవరం ఎంఎల్ఎ అంజిబాబును కోరినా స్పదించలేదని టిడిపి నాయకుడు వాపోయాడు. ఆక్రమణలు తొలగించకుండా స్టే ఆర్డర్ ఉన్నా అధికారులు పట్టించుకోలేదంటూ చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఆర్అండ్‌బి అధికారులకు ఒక్క నవుడూరులోనే ఆక్రమణలు గుర్తించారా అంటూ విమర్శలున్నాయి. నవుడూరు సెంటర్‌లో నాలుగు కూడలి రోడ్ల వెంబడి ఆక్రమణలు ఉన్నాయంటున్నారు. వాటిని కూడా తొలగించాలంటూ డిమాండ్ వ్యక్తం చేస్తున్నారు. నవుడూరు సెంటర్‌లో ఆర్అండ్‌బి రహదారిని ఆక్రమించుకుని, నిర్మాణాలు చేసి అద్దె వసూలు చేసుకుంటున్నట్టుగా.. వీరవాసరంలో కూడా ఇదేవిధంగా ఆర్అండ్‌బి రహదారిని ఆక్రమించుకుని అద్దె వసూలు చేసుకుంటున్న వారు ఆర్అండ్‌బి అధికారులకు కానరావడం లేదా అంటూ మరికొంత మంది ప్రశ్నిస్తున్నారు.

'విద్యుత్ మీటర్ రీడర్లను రోడ్డున పడేయొద్దు '

భీమవరం : విద్యుత్ స్మార్ట్ మీటర్స్ పేరుతో విద్యుత్ మీటర్ రీడర్లను రోడ్డున పడేసి మీటర్ రీడర్స్ పొట్టలు కొట్టొద్దని, ప్రత్యామ్నాయం చూపి ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్స్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఎఐటియుసి విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం చినరంగనిపాలెంలో నిరసన ప్రదర్శన చేసి విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రలను విద్యుత్ ఎస్ఇ ఆలపాటి రఘునాధ్ బాబు, డిఇ నరహరశెట్టి వెంకటేశ్వరరావు సమర్పించారు. ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, విద్యుత్ మీటర్ రీడర్స్ డివిజన్ అధ్యక్షుడు పి.జాకబ్, జిల్లా ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఎ అద్దేపల్లి కోడలు మృతి

పాలకొల్లు : విద్యాదాత, వితరణశీలి, పాలకొల్లు మాజీ ఎంఎల్ఎ అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి కోడలు అద్దేపల్లి రత్నమాల(85) గురువారం ఉదయం పాలకొల్లులోని వారి స్వగృహంలో మృతిచెందారు. ఆమె భర్త రాంప్రసాద్ పది సంవత్సరాలు కిందట మృతిచెందారు. వారికి ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణకు ఆమె స్వయంగా చెల్లెలు. ఆమె మృతిపట్ల మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్ఎలు బంగారు ఉషారాణి, డాక్టర్ బాబ్జి, అల్లు వెంకట సత్యనారాయణ, చాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు, ఎఎంసి మాజీ అధ్యక్షులు ఉన్నమట్ల కబర్ది, గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, బంగారు కృష్ణబాబు, పెచ్చెట్టి బాబు, జివి సంతాపం వ్యక్తం చేశారు.

కొత్తాటలో చోరీ

మొగల్తూరు : మండలంలోని కొత్తాట గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పొన్నమండ ఏడుకొండలు ఈనెల 19న ఇంటికి తాళం వేసి చర్చిలో ప్రార్ధనకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉంది. ఆ ఇంట్లో నాలుగు గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు, రెండు గ్యాస్ సిలిండర్లు, లాప్టాప్, మొబైల్ ఫోన్ అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఏడుకొండల కుమారుడు నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. సంఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. సంఘటన ప్రాంతాన్ని శిక్షణ డిఎస్‌పి కె.మానస సందర్శించి వివరాలు నమోదు చేశారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన

ఉండి : నేటి సమాజంలో చిన్నారులు లైంగిక వేధింపులు విద్యార్థి దశ నుంచే ఎదుర్కొంటున్నారని సీనియర్ డివిజన్ సివిల్ జడ్జ్ ఎం.సుధారాణి అన్నారు. గురువారం సాయంత్రం విద్యార్థినులకు ఫోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహనా సదస్సును ఉండి బాలికల వసతి గృహంలో హాస్టల్ వార్డెన్ చిత్రకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ డివిజన్ సివిల్ జడ్జ్ ఎం.సుధారాణి మాట్లాడుతూ చిన్నారులు అపరిచిత వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు తీసుకోవడంతో కొందరు వారిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, అటువంటి చిన్నారులకు వారి ప్రాథమిక హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వం ఫోక్సో చట్టం తీసుకువచ్చిందన్నారు. చిన్నారుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినట్లయితే వెంటనే తల్లికి గాని, దగ్గర్లోని పోలీస్ స్టేషన్ వద్ద గాని ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం ప్రతి మండలంలోని విద్యార్థినులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు ఎన్.సుదీర్, పి.అంబేద్కర్, ఎంబి.భవాని, పాల లక్ష్మి, ఆకివీడు సిఐ జగదీశ్వరరావు, ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నెగ్గిపూడి..!

అసంపూర్తిగా గ్రామసచివాలయ నిర్మాణం
స్థానికుల ఆందోళన

ప్రజాశక్తి - పెనుమంట్ర

చీకటి పడితే చాలు పరిసర ప్రాంతాలకు చెందిన యువకులు అక్కడకు చేరిపోతుంటారు. మందు, ముక్క, సిగరెట్స్‌కు తోడుగా గంజాయి పాకెట్స్ కూడా తెచ్చుకుంటారు. ఇదంతా మార్టేరు సెంటర్‌కు కూతవేటు దూరంలో ఉన్న నెగ్గిపూడి గ్రామ పంచాయతీ పరిధిలో అసంపూర్తి నిర్మాణంతో ఆగిపోయిన గ్రామ సచివాలయం భవనం కింద, పైన అంతస్తుల్లో నిత్యం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో ఇక్కడ మందు, గంజాయి బ్యాచ్లకు చెందిన యువకులు చేసే అల్లరికి అడ్డు ఉండడం లేదని, మత్తులో కొందరు బ్లేడుతో వాళ్లకి వాళ్లే గాయాలు చేసుకొని, కేకలు వేస్తూ ఆ ప్రాంతంలో రచ్చ చేస్తున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. పోలీసు శాఖ వారు వెంటనే ఇక్కడ నిఘా పెట్టి, ఇక్కడ జరిగే అసాంఘిక కార్యక్రమాలు నిరోధించి, బాధ్యులను పట్టుకొని శిక్షించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రక్తపు మరకలతో చెల్లా చెదురుగా అసంపూర్తిగా ఉన్న గ్రామసచివాలయం పై అంతస్థులోని గది

రబీలో అధిక దిగుబడి సాధించాలి

మార్టేరు ఫారం ఎడిఆర్ డాక్టర్ శ్రీనివాస్

పెనుమంట్ర : రబీ సీజన్‌లో రైతులు అధిక దిగుబడి సాధించడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఇచ్చే సలహాలు పాటించాలని మండలంలోని మార్టేరు ఫారం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శిక్షణ-సందర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రబీ కాలంలో రైతాంగం ఎదుర్కొనే ప్రధాన సమస్య మిల్లింగ్‌లో గింజ విరిగిపోయి, నూక ఎక్కువగా రావడం వల్ల కొనుగోలు ధర తగ్గిపోతుందని అన్నారు. ఎంటియు 1121 రకం పంటకాలం 125 మాత్రమే కావున నిర్ణీత పంట కాలం పూర్తికాగానే, వెన్నులో 80-90 శాతం గింజలు పసుపురంగుకు మారి పక్వానికి వచ్చి, కర్ర పచ్చిమీద ఉన్నప్పుడే పంటను కోసేయాలన్నారు. పూర్తిగా ఎండిపోయే వరకు చేనుపై ఉంచకూడదన్నారు.

గుంటూరు లాం ఫారంలో ఈనెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన జరుగుతుందని, దీనిలో దక్షిణ భారత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళ, లక్షద్వీప్, అండమాన్ రాష్ట్రాలకు చెందిన రైతులు పాల్గొంటారని ఎడిఆర్ తెలిపారు. ఈ ప్రదర్శన కేంద్ర వ్యవసాయ శాఖ, ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరగుతుందని, జిల్లా రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ శాఖను ఆయన కోరారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు ప్రదర్శన విజయవంతం అవుతుందని తెలిపారు. చిరు సంచి ప్రదర్శనలో ఉన్న సన్నగింజ రకం ఎంటియు 1426 రకం ఆశాజనకంగా ఉందని తెలిపారు. దాళ్వాలో పిఆర్ 126కి ప్రత్యామ్నాయంగా ఎంటియు 1153, ఎంటియు 1293 రకాలను ప్రోత్సహించడానికి ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎంవి.కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త(విస్తరణ విభాగం) వారు సమన్వయకర్తగా కార్యక్రమాన్ని నడిపించారు.

ప్రతిఒక్కరూ ఇకెవైసి చేయించుకోవాలి

ఆచంట : రేషన్ కార్డులో పేరు నమోదైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇకెవైసి ప్రక్రియను చేయించుకోవాలని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇకెవైసిని చేయించకపోతే రేషన్ నిలిచిపోవడంతో పాటు వివిధ రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా లభించే అవకాశం ఉండదన్నారు. ప్రభుత్వ పథకాలు సమగ్ర అమలుకు నూటికి నూరు శాతం ఇకెవైసి పూర్తి చేయాలన్నారు. ఆవిధంగా చేయడం వల్ల పౌరులకు భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవన్నారు. ప్రతి ఒక్కరూ ఈ నెలాఖరులోగా ఇకెవైసి పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని, ఆ ప్రకారం ప్రతి రేషన్ షాపులోనూ, రేషన్ డీలర్లు తమ ఈపాస్ యంత్రంతో అందుబాటులో ఉందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డీలర్లు అందుబాటులో ఉంటారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి నిరంతరాయంగా పొందేందుకు వీలుగా ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన ఆదేశించారు. దీనికి మండల వ్యాప్తంగా ఉన్న అన్ని రేషన్ షాపుల్లోనూ ఈపాస్ మిషన్ల ద్వారా ఇకెవైసిని చేయించుకోవాలన్నారు. ఇవి కాకుండా మీ సేవ, ఆధార్ కేంద్రాల్లో కూడా ఇకెవైసిని చేయించుకోవచ్చు అన్నారు.

ఇస్రో 'యువ విజ్ఞానానికి' దరఖాస్తుల స్వీకరణ

పెనుమంట్ర : యువ శాస్త్రవేత్తలకు అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఆహ్వానం పలుకుతోంది. యువతకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది యువ విజ్ఞాన కార్యక్రమం(యు.వి.కా) నిర్వహిస్తోంది. ఈ ఏడాది చేపట్టబోయే కార్యక్రమానికి తొమ్మిదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇందులో పాల్గొనే విద్యార్థులకు నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడేందుకు అవకాశం కూడా కల్పిస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. వీటితోపాటు స్పేస్, సైన్సు క్లబ్‌లో ఉంటే 5 శాతం వెయిటేజీ ఇస్తారు. సైన్సు క్లబ్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైన్స్ వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉంటే 10 శాతం వెయిటేజీ, ఎన్‌సిసి స్కౌట్స్, గైడ్స్‌గా ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 20 శాతం, పట్టణ ప్రాంతాల వారికి 5 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు ఈనెల 23వ తేదీలోగా %www.isro.gov.in%లో రిజిస్ట్రేషన్ చేసుకుని దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఏప్రిల్ 7న ఎంపికైన విద్యార్థుల జాబితాను ఇస్రో యువికా విభాగం విడుదల చేస్తుంది. మే 18 నుంచి విద్యార్థులను విడతల వారీగా ఆహ్వానిస్తారు. మే 19 నుంచి 30 వరకు యువికా-25 కార్యక్రమం నిర్వహించి 31న ముగింపు కార్యక్రమంలో ప్రతిభ ఆధారంగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందివ్వనున్నారు.

కలెక్టర్‌ను కలిసిన డిఎంహెచ్‌ఒ

భీమవరం : స్థానిక జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన డిఎంహెచ్‌ఒ డాక్టర్ గీతా బాయి మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంగా కృషి చేయాలని, ఇందుకు అనుగుణంగా తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి మెడికల్ అధికారులు, సిబ్బందిని సమయత్వం చేయాలన్నారు.

22 నుంచి కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

పెనుమంట్ర : రాష్ట్రంలోని 352 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్రశిక్షా అభియాన్ ఎస్‌పిడి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాలయాల్లో 6, 11వ తరగతుల్లో ప్రవేశాలు, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఆన్లైన్లో ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. వెబ్‌సైట్ %https://apkgbv.apcfss.in% ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌పిడి కోరారు. సమస్యలు, సందేహాలు ఉంటే 7075159996, 7075039990 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.